ఈనాడు నల్గొండ


ఆదివారం అక్టోబరు 20, 2024

ఎంజీయూ వీసీకి పలువురి అభినందనలు



నూతన వీసీ అల్తాఫ్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా శనివారం బాధ్యతలు చేపట్టిన ప్రొ. అల్తాఫ్ హుస్సేన్‌ను ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వీసీని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తాము ఎల్లప్పుడు ముందుంటామని కళాశాలల ప్రతినిధులు పేర్కొన్నారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యానారాయణరెడ్డి, కేజీ టూ పీజీ జాక్ ఛైర్మన్ గింజల రమణారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, ఈసీ సభ్యులు లింగయ్య, ప్రవీణ్‌కుమార్, రామ్మోహన్, సత్యంగౌడ్, ఆదిత్య సామ్రాట్, డా. భాస్కర్‌రావు, శంకర్ పాల్గొన్నారు.



బియ్యంలో రారాజు నల్గొండ

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కృష్ణా నీటి ఆధారంగా ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సాగు అవుతుంది. అలా పండిన ధాన్యం మంచిదని, నాణ్యమైందని గతంలో నిర్వహించిన పరీక్షల్లోనూ తేలింది. రెండు రకాలుగా పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కృష్ణా జలాలతో వరి పండుతున్నా.. నల్గొండ జిల్లాలో పండిన ధాన్యం నాణ్యమైందని నిరూపణ కాగా, రుచికరమైందని కూడా అంటుంటారు. అందుకే నాణ్యమైన, రుచికరమైన బియ్యానికి నల్గొండ రారాజు అన్న పేరుంది. అన్నం రుచిని గుర్తించిన వారు ఏ ప్రాంతంలో ఉన్నా నల్గొండ ప్యాకింగ్ బియ్యం కొనుగోలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. నాణ్యత, రుచి ఉండటం వల్ల ఏ జిల్లా బియ్యం కూడా ఇక్కడి బియ్యంతో పోటీ పడలేవని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లా నుంచి భారీ ఎగుమతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి షరతులు లేకుంటే ఒక్క జిల్లా నుంచే దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఇందులో సింహభాగం బాయిల్డ్ బియ్యమే అయినా పచ్చి బియ్యం కూడా ఎగుమతి జరుగుతుంది. దేశంలో ఎక్కువగా ఎగుమతులు జరుగుతుండటంతో బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాలను భారీగా పెంచింది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మాత్రం భారీగానే ఎగుమతి జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ధరలను సమీక్షించుకుంటూ ఎగుమతులకు అనుమతులు ఇస్తుంది. ఉమ్మడి జిల్లాలో 300 మిల్లులు ఉండగా అందులో పచ్చిబియ్యం మిల్లులు 120, మిగతా బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి.

★ జిల్లా నుంచి సింగపూర్, మలేషియా, దుబాయ్‌తో పాటు అన్ని అరబ్ దేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. వీటితో పాటు ఆఫ్రికా దేశాలకు పచ్చి బియ్యం, బాయిల్డ్ బియ్యం సరఫరా అవుతాయి. గతంలో పాకిస్థాన్‌కు కూడా జిల్లా నుంచి ఎగుమతులు జరిగాయి. ఇతర దేశాలకు ఎగుమతిదారులు వారు కోరిన ప్యాకింగ్‌లలో ఇస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో సాగు (ఎకరాల్లో), దిగుబడి (మెట్రిక్ టన్నులలో) అంచనా వివరాలు

జిల్లా	సన్నరకాల సాగు	దిగుబడి	దొడ్డు రకాల సాగు	దిగుబడి
నల్గొండ	2,42,490	5,81,975	1,90,527	4,57,265
సూర్యాపేట	3,41,650	8,19,960	1,09,042	3,05,318
యాదాద్రి	97,028	1,74,650	52,245	1,04,490

ఉమ్మడి జిల్లాలో నేలల రకాలు (ఎకరాల్లో)


జిల్లా	చౌడు	ఇసుక, రాతి నేలలు	నల్లరేగడి	ఎర్రనేలలు
యాదాద్రి	12,655	45,250	2,49,077	5,00,000
నల్గొండ	1,10,035	4,92,065	11,422	9,58,522
సూర్యాపేట	8,000	2,92,676	68,100	3,20,110

దేశంలో ఇలా...

మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు బియ్యం ఎగుమతులు జిల్లా నుంచి జరుగుతాయి. మహారాష్ట్రలో జైశ్రీరామ్ (చింట్లు) రకం పచ్చి బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కువగా ఎగుమతి జరుగుతున్నాయి. మన దగ్గర ఎక్కువగా వాడే బీపీటీ కంటే సన్నగా జైశ్రీరాం ఉన్నా మన రాష్ట్రంలో వీటి వాడకం తక్కువని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు.

నాలాలు కనిపించవేం..!

పరిశీలన



నకిరేకల్: పాత ఉడిపిహోటల్ సమీపంలో నాలా.. ఆక్రమణలతో ఇలా సందులా మారింది

నకిరేకల్, న్యూస్‌టుడే: నాలాలు.. మురుగు కాల్వలను నకిరేకల్ పుర పరిధిలో ఆక్రమించేస్తున్నారు. వీటిపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు.. ఫలితంగా భారీవర్షాలు కురిసినప్పుడు నీరు పల్లపు ప్రాంతాలకు పారకుండా ఆక్రమణలు అడ్డుగా మారుతున్నాయి. గతంలో భారీ వర్షాలకు పుర పరిధిలోని ఆఫీసర్స్‌కాలనీ, సంతోష్‌నగర్, డాక్టర్స్ కాలనీ, విద్యానగర్ కాలనీలను వరద ముంచెత్తింది.

■ ఇసాయికుంట శిఖం స్థలంలో సాయి మందిరం ఎదురుగా నాలా స్థలాలను ఆక్రమించి కొన్ని సంఘాల వారు తమ భవనాలను అక్రమంగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీరికి రాజకీయ అండ ఉండటంతో భవిష్యత్‌లో ఈ భవనాలను దుకాణసముదాయాలుగా మార్చుకునేందుకు వీలుగా నిర్మించుకుంటున్నారు. నాలాలను.. కాల్వలను పూడ్చివేస్తూ ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న దందా కూడా ఇక్కడ సాగుతోంది.

■ నకిరేకల్‌లో ప్రధాన రహదారిని (పాత జాతీయ రహదారి) దాటుతున్న ఐదు నాలాలు, వరద కాల్వలు ఆక్రమణ చెరలోనే ఉన్నాయి. చెరువులు, కుంట శిఖం భూముల్లో, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నందున ఇక్కడ కూడా హైడ్రా వంటి అధికారిక సంస్థను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఇటీవల సీఎంకు లేఖ రాయడం గమనార్హం.

■ పాత జాతీయ రహదారిని దాటుతూ దుర్గగుడి సమీపం నుంచి వెళుతున్న నాలా, పాత ఉడిపి హోటల్ వద్ద నుంచి వెళుతున్న కాలం వారి చెరువు వరదను తీసుకెళ్లే నాలా పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. నాలాల స్థలాలపై దుకాణాలు నిర్మించారు.

■ సాయిమందిరం సమీపంలో పది అడుగుల వెడల్పుతో ఉన్న నాలా కనుమరుగైంది. దీని స్థానంలో మూడు వంపులు తిప్పుతూ చిన్న మురుగు కాల్వను నిర్మించడం గమనార్హం.

■ పటేల్‌నగర్‌లో ప్రధాన రహదారి వెంట ఉన్న నాలా ఆక్రమణలకు గురైంది. గత రెవెన్యూ చట్టాల్లోని లొసుగులతో నాలా స్థలానికి పట్టాలు, రిజిస్ట్రేషన్లు పుట్టించి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు.



దుర్గగుడి సమీపంలో మురుగు కాల్వపైనే దుకాణం నిర్మాణం

ఏడాదిగా ముందుకు సాగని పనులు

సాయిమందిరం, కోర్టు పక్కన ఉన్న పెద్ద నాలాలను కొద్దిమేరలో సీసీగా అభివృద్ధి చేసేందుకు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.3.40 కోట్లు మంజూరు కావడంతో ఏడాది క్రితం ఈ నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారు. నేటికి పనులు మాత్రం చేపట్టలేదు. ఈ రెండు నాలాల అభివృద్ధి పనులకు సాంకేతిక అనుమతులు రావాల్సి ఉందని పురపాలిక ఏఈ గౌతమ్‌రాజ్ తెలిపారు. అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు.

చర్యలు చేపడతాం..:

– డి.బాలయ్య, కమిషనర్, పురపాలిక, నకిరేకల్

నాలాలు, మురుగు కాల్వల ఆక్రమణలపై కౌన్సిల్ అనుమతితో పరిశీలన చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. వార్డుల్లో వర్షం, మురుగు నీటి పారుదల కోసం కొత్తగా మురుగు కాల్వల నిర్మాణాల కోసం సర్వే చేపడుతున్నాం.



కన్నీటితో కట్టలు కట్టి.. ఆశలు నిలబెట్టి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు వచ్చిన వరి అక్కడక్కడ నేలకొరిగింది. ఇలా నేలవాలిన పంటను గింజలు రాలకుండా ఉండేందుకు అన్నదాతలు శ్రమించి.. జాగ్రత్తగా వరి కట్టలు కట్టారు. పొలాలు తడి ఆరిన తర్వాత మనుషుల సాయంతో వీటి కోతను కోయాల్సి వస్తుంది. నల్గొండ జిల్లా హాలియా 14వ మైలురాయి సాగర్ కాలువ వద్ద ఓ రైతు వరిని కట్టలు కట్టాడు. ఇలా చేస్తే ఖర్చు పెరిగినా.. పంట నష్టం కొంతైనా తగ్గుతుందని ఆయన ఆవేదనతో తెలిపారు. – ఈనాడు, నల్గొండ

కేజీబీవీల్లో ఖాళీల భర్తీ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రత్యేకాధికారిణులు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీ పోస్టులలో జనరల్, మెరిట్ జాబితా నుంచి సబ్జెక్టు వారిగా 1:1 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు శనివారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఈవో బి.భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొత్తం 54 మందికి 50 మంది హాజరయ్యారు. మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందచేశారు. వెంటనే కేజీబీవీలో చేరాలని వారికి సూచించారు. జీఈసీవో పి.సరిత పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా!



మిర్యాలగూడలోని శాంతినగర్‌లో శుక్రవారం పిడుగుపాటుకు గురైన ఇళ్లను శనివారం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ పరిశీలించారు. పిడుగుపాటుతో నష్టపోయిన బాధితులను పరామర్శించి.. అధైర్య పడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.
– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

అలరించిన ఖవ్వాలీ

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: సయ్యద్ షా లతీవుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దర్గా మెట్ల వద్ద నిర్వహించిన ఖవ్వాలీ కార్యక్రమం సంగీత ప్రియులను ఆకట్టుకుంది. లతీవుల్లా ఖాద్రీని స్మరిస్తూ పాడిన పాటలు వీక్షకులు మళ్లీ పాడాలని కోరారు.



హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అఖిల్, షకిల్ నార్సీ సూఫీ ఖవ్వాలీ బృందం, ఔరంగబాద్‌కు చెందిన ఫర్హీన్ సుల్తాన బృంద సభ్యులు పోటీ పడి పాడారు. ఉర్సు సందర్భంగా జాగారం చేసే భక్తులకోసం నిర్వహించే కార్యక్రమాన్ని వందలాది మంది తిలకించారు.

ఐటీఐలలో స్పాట్ అడ్మిషన్లకు 30 వరకు గడువు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఐటీఐలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 30 వరకు స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఐటీఐల కన్వీనర్ నర్సింహాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు సీట్లు కేటాయించని, ఆసక్తిగల అభ్యర్థులు ఐటీఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. గత ఆరు విడతల్లో నమోదు చేసుకున్న వారు అవసరం లేదన్నారు. గతంలో సీట్లు కేటాయించిన విద్యార్థులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారంతో పాటు ఒరిజినల్ ధ్రువపత్రాలతో సీటు కావల్సిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఈనెల 30వ తేదీలోపు భౌతికంగా హాజరుకావాలని సూచించారు.

జాలువారుతున్న జలం.. హృదయాలు పులకించే తరుణం



నల్లమల అటవీప్రాంతాల్లో జాలువారుతున్న జలపాతాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దేవరచర్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురాతన శివాలయం వద్ద, రేకులగడ్డ, చిత్రియాల గ్రామాల సమీపంలోని మామిడిగుండాల జలపాతంతోపాటు పొగిళ్ల గ్రామ సమీపంలోని గవ్వలసరి జలపాతాలు వరుసగా కురుస్తున్న వానలకు జాలువారుతూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఆయా ప్రదేశాల్లో అడవి జంతువులు సంచరిస్తున్నాయన్న హెచ్చరికలు ఉన్నప్పటికీ పర్యాటకులు ఈ జలసవ్వడులను చూసేందుకు బారులు తీరుతున్నారు. దేవరచర్ల నల్లమల అటవీ ప్రాంతంలో కనువిందు చేస్తున్న జలపాత దృశ్యమిది.

– న్యూస్‌టుడే, చందంపేట

నీడనిచ్చే షెడ్.. విరాళాల విభాగం ఏర్పాటు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులలో నడవలేని వారితో పాటు వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ప్రధానాలయానికి చేర్చే బ్యాటరీ వాహనాల కోసం వేచి ఉండేందుకు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రత్యేక షెడ్‌ను నిర్మించింది. వీవీఐపీల వాహనాల పార్కింగ్ ప్రాంగణంలోని బ్యాటరీ వాహనాల స్టాండ్ వద్ద నీడనిచ్చే షెడ్‌తో పాటు కూర్చునేందుకు బెంచీలు ఏర్పరిచారు. బస్‌స్టాండ్, కార్ పార్కింగ్ నుంచి వృద్ధులు, గర్భిణులు, బాలింతలు నడుస్తూ ఆలయానికి చేరడం కష్టమే. వారి కోసం దాతల సహకారంతో బ్యాటరీ వాహనాలు కల్పించిన దేవస్థానం ఇతర వసతులు కల్పిస్తోంది.

★ ఆలయ కైంకర్యాలు, అన్నప్రసాదం, గదుల నిర్మాణానికి దాతలు సమర్పించే విరాళాల సేకరణకు ప్రధానాలయ మాడవీధిలో ప్రత్యేక విభాగం నిర్మించారు. ఆలయానికి అనుగుణంగా ఫైబర్ షీట్ల ద్వారా దేవుడి బ్రహ్మోత్సవ రథశాల పక్కనే సదరు విభాగం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



విరాళాల సేకరణ కోసం ఏర్పాటైన విభాగం

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

డ్యాంను పరిశీలించిన సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాంను సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ నిత్యానంద ముఖర్జీ శనివారం సందర్శించారు. ఆయన ఈ సందర్శనలో భాగంగా హాలియా ప్రాంతంలోని ఎడమ కాల్వపై, సాగర్ డ్యాం దగ్గర ఉన్న నీటి విడుదలకు సంబంధించిన టెలిమెంటరీ సిస్టమ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జునరావు, ఏఈ కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నడత నేర్పిన తరం.. తరలిపోతోంది..!

ఆదివారం ప్రత్యేకం

న్యూస్‌టుడే, నాంపల్లి

పాల నురగకు తీసిపోని ధవళ వర్ణపు వస్త్రధారణ.. రాజసాన్ని చూపే పంచెకట్టు.. హుందాతనానికి గుర్తుగా తాత మీసం కట్టు.. ఆత్మ గౌరవాన్ని కళ్లకద్దే బొమ్మ బొట్టు.. ప్రేమైక జీవనయానంతో అధిరోహించిన వయసు మెట్లు.. పనస సౌరభం లాంటి స్వేద సుగంధంతో తనువు చాలించే వరకూ తప్పని నీతి సుట్టు.. స్వచ్ఛమైన మనసు.. మధురమైన పలకరింపుతో మన కలలను నిజం చేసిన పెద్దల తరం వెళ్లిపోతోంది. జీవన కడలిలో కష్టాల సుడిగుండాలు చుట్టిముట్టినా తొణకని గంభీర స్వరం మూగబోతోంది. ధర్మనిష్ఠ పాటిస్తూ కుటుంబాలకు నాగరికత నేర్పిన నాటి తరం.. తరతరాలకు తీపి సూక్తులను మిగిల్చిపోతున్నారు. తాత, అమ్మమ్మ, నానమ్మ ఇలా.. కాలక్రమేణా ఒక నాటి పెద్దల తరం వయోభారంతో కనుమరుగవుతోంది.

దీపాల వెలుగుల్లో దేదీప్య జీవనం..

పూటగడవని ఆ రోజుల్లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పస్తులైనా భరించే వారు తప్ప ఇంటి గుట్టు బయటపడనిచ్చే వారు కాదు. 'కాకి పిల్ల కాకికి ముద్దు' సామెత చందంగా చిరిగిన బట్టలు కుట్టుకొని ధరించే ఇంటి పెద్ద తమ సంతానానికి ఏ లోటు రాకుండా చూసేవారు. పప్పిడి మెతుకులే పరమాన్నంగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తాము పడే 'ఈతి' బాధలు పక్కింటి వారితో కూడా చర్చించే వారు కాదు. రోజువారి పనికి సమయంతో పనిలేదనే భావన వారిలోఉండేది. వ్యవసాయానికి యంత్రాలు లేని నాటి కాలంలో.. తెల్లవారకముందే సాగు పనుల్లో నిమగ్నమై దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరేవారు. పగలంతా పడిన కష్టాన్ని మరిచి మిణుకు మిణుకు వెలిగే నూనె దీపాల వెలుగుల్లో ఇంటిల్లిపాది కూర్చొని కాచిన గంజే.. మెతుకులో కలిసి తినడం వారికి సంతృప్తినిచ్చేది. నాగరికత నడక నేర్చుకునే రోజుల్లోనే కుటుంబాల కోసం సర్వం ధారపోసిన ఆ పెద్దయిన నేడు క్రమంగా కనుమరుగవుతున్నారు.

పెద్దల మాట పరమాన్నం మూట..

'పెద్దల మాట చద్దన్నం మూట' సామెత అందరికీ తెలిసిందే. ఆ రోజుల్లో అత్యధికంగా ఉమ్మడి కుటుంబాలే ఉండేవి. ఒక్కో ఇంట్లో పగలూ రాత్రి కలిసి 20 కిలోల వరకు ఆహార ధాన్యాలు వండి వార్చే వారంటే అతిశయోక్తి కాదు. ఒక కుటుంబంలో 10 నుంచి 20 మంది వరకు కుటుంబ సభ్యులున్నా బేషజాలు ఉండేవి కావు. అంతమందిలోనూ నీతి నియమాలే కట్టుబాట్లుగా కుటుంబ పెద్ద చెప్పిందే వేదం. తమ కుటుంబంలోని పిల్లలకు పెళ్లి సంబంధాలు చూడాలన్నా.. పెళ్లిళ్లు చేయాలన్నా ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకునేవారు. ఇక శుభకార్యాలకు ఏ ఒక్క బంధువునీ మర్చిపోకుండా ఆహ్వానించి వారం రోజులు వెళ్లనిచ్చేవారు కాదు. ఇలా రోజంతా వరసైన బంధుత్వపు పిలుపులతో పల్లె లోగిళ్లు కళకళలాడేవి. ఈ మమకారానికి కారణం ఆ పెద్దయనే సుమా..! ఆకలి దంపుకొని కుటుంబం కోసం పరితపించిన పెద్దయిన, పెద్దావిడను కడుపున పుట్టిన బిడ్డలు చేరదీయకపోవడంతో ఇప్పటికీ కొన్ని చోట్ల అనాధాశ్రమాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ☛ ఇది మన సంస్కృతి కాదు కదా. తమకోసం ఏమీ దాచుకోకుండా.. సమాజానికి నడ(వ)డి నేర్పిన పెద్దలు వయోభారంతో మళ్లీ పసివారైతే.. కంట నీరు ఆగనంటోంది.. మనసు మౌనంగా రోదిస్తోంది. మరణమే ఎందో లేదో తెలీదు కాబట్టి మనకు జన్మనిచ్చిన వారిని, నడత నేర్పిన పెద్దలనూ ఈ జన్మలోనే గౌరవిద్దాం. వారిని కడవరకూ కుటుంబాలతోనే కలిసి ఉండేలా చూద్దాం. వారి ఆశలు.. ఆశయాలు.. ఆకాంక్షలు నెరవేర్చడం బాధ్యతగా తీసుకుందాం.



ఉమ్మడి జిల్లాలో వయోవృద్ధుల వివరాలు (సుమారు)

నల్గొండ	54,000
యాదాద్రి	23,000
సూర్యాపేట	32,000

తమకంటూ ఏమీ దాచుకోలేదు..

ప్రస్తుతం పల్లెల్లో డాబా ఇళ్లు.. అంతస్తులు వెలుస్తున్నాయి. గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కార్మికులకంటే ఇంటి యజమాని ఎక్కువ కష్టించేవారు. మట్టి, కలప ఎడ్ల బండితో ముందస్తుగా చేరవేసేవారు. తానూ ఓ కార్మికుడై ఇంటి నిర్మాణంలో పాలుపంచుకునేవారు. తాము కట్టుకున్న అరుదైన గూటిలో పిల్లా పాపలతో ఆనందంగా గడిపేవారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తాము నమ్ముకున్న భూమి, కట్టుకున్న ఇల్లు మాత్రం అమ్మకానికి పెట్టేవారు కాదు. తల్లిదండ్రులను ఎంత ఆప్యాయంగా చూసుకునేవారో పంట క్షేత్రాన్ని, పాడి సంపదనూ అంతే ప్రేమగా ఆరాధించేవారు. తమ బిడ్డలు నిరాశ్రయులు కావొద్దనే ఆకాంక్షతో తమ కాంక్షలెన్నో చంపుకొన్నారు. తాము సంపాదించిన ఆస్తిలో ఇసుమంతైనా అమ్ముకోకుండా కుటుంబ శ్రేయస్సు కోసం శ్రమించిన పెద్దలు వెళ్లిపోతున్నారు.

ఆ రోజుల్లో ఎనలేని గౌరవం



అంబల్ల చెన్నయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, నాంపల్లి

పూర్వం సమాజంలో పెద్దల మాటకు ఎనలేని గౌరవం ఉండేది. ఏ పని చేయాలన్నా వారి సలహాలు, సూచనలు పాటించేవారు. ఆ కారణంతోనే అప్పట్లో కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు పటిష్ఠంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. మన నడవడి మన పిల్లలకు భవిష్యత్తు పాఠం నేర్పుతుందనే విషయం విస్మరించొద్దు. నేటి తరం వారు పెద్దల సూచనలు పాటించి, వారి పట్ల ప్రేమ చూపిస్తే రేపటితరం కూడా అదే నేర్చుకుంటారు. పెద్దలు ఆత్మీయత పంచే అక్షయ పాత్ర లాంటి వారు. వారిని గౌరవించడం అందరి బాధ్యత.

జన్మాంతం కుటుంబశ్రేయస్సుకే...



వీరమళ్ల లక్ష్మమ్మ, నాంపల్లి

జీవితమంతా కుటుంబ శ్రేయస్సు కోసం ధారపోసిన పెద్దలు వృద్ధాప్యంలో కోరుకునేది ఆత్మసంతృప్తి. అదెక్కడ దొరుకుతుంది.. కన్న బిడ్డలు ప్రయోజకులుగా మారి కళ్లెదుట ఉన్నప్పుడు.. ప్రేమ, ఆప్యాయత చూపినప్పుడు. ప్రస్తుతం ఉపాధి కోసం, ఉరుకుల పరుగుల జీవితంలో అన్ని కుటుంబాల్లో అది సాధ్యం కావడం లేదు. ఉన్న సమయంలోనే కొంత ముదిమిలో ఉన్న కన్నవారి కోసం కేటాయిస్తే వారికి కనుల సంబరంగా ఉంటుంది. అంతకు మించి వారు ఆశించేది కూడా ఏమీ ఉండదు.

నేడు ఖోఖో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా జూనియర్ ఖోఖో బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను గుర్రంపోడు మండలం కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు వయసు ఉండి, నవంబరు 22, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని సూచించారు. వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన వారు అక్టోబరు 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

రూ.పది నాణెం చెల్లుతుంది

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికులు ఇచ్చే రూ.10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు సైతం జారీ చేశారు. ఇంత ప్రచారం చేపడుతున్నా.. అవగాహన రాహిత్యంతో కొంత మంది ప్రజలు కూడా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు.



రాజపేట బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన గోడపత్రిక

అసలెందుకీ పరిస్థితి..

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్ద నోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలా మంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులకు తెరలేపారని కొందరి వాదన. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా బ్యాంకు సేవలకు వచ్చేవారికి కనిపించే విధంగా బ్యాంకు కార్యాలయం ప్రాంగణంలో పదిరూపాయల నాణేల చెల్లింపుల పోస్టర్లను, ఫ్లెక్సీలను బ్యాంకు అధికారులు ప్రదర్శిస్తుండటం విశేషం.

అవగాహన కల్పిస్తున్నాం..

– తిరుమలశెట్టి నాగలక్ష్మి, మేనేజరు, గ్రామీణ వికాసబ్యాంకు, రాజపేట

పది రూపాయల నాణేలు చెలామణి విషయమై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎవరైనా వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టపరంగా చర్యలుంటాయనే విషయాన్ని సైతం వివరిస్తున్నాం. అపోహలను నమ్మకుండా నిరభ్యరంతరంగా పది రూపాయల నాణేలను తీసుకోవచ్చు. తిరిగి చెల్లించవచ్చు.


18 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి సాగర్‌కు వరద నీటిరాక కొనసాగుతుండగా ఎన్నెస్పీ అధికారులు 18 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,90,198 క్యూసెక్కుల వరద వస్తుండగా ఎన్నెస్పీ అధికారులు డ్యాం 26 గేట్లలో 18 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతో పాటు కుడికాల్వ ద్వారా 6,112 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కులు మొత్తం 1,90,198 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉంది.



విడుదలవుతున్న నీరు

నూతన వీసీగా బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొ.అల్తాఫ్ హుస్సేన్ శనివారం వర్సిటీలోని ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వీసీగా పనిచేసిన అనుభవంతో వర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటుగా వారి విద్యాభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీతో పాటు పరిధిలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రణాళికలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధన పరిజ్ఞానం పెంపొందించేలా సెమినార్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి అధ్యాపకులు, సిబ్బందితో ముచ్చటించారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ ప్రొ. అంజిరెడ్డి, వై.ప్రశాంతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటరమణారెడ్డి, అరుణప్రియ, రాంరెడ్డి, ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీహరి కోటకు..తేజ విద్యార్థి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ, భారత కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులకు 'జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్-2024' పోటీలు నిర్వహించారని, అందులో ప్రతిభ చూపిన కోదాడకు చెందిన విద్యార్థి గుజ్జుల హర్షవర్ధన్ రెడ్డి ఎంపికైనట్లు తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా తెలిపారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ పోటీలను నిర్వహించగా.. 3,66,308 మంది పాల్గొన్నారని, అందులో 100 మందిని ఎంపిక చేశారన్నారు. తేజ పాఠశాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా 7వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడని తెలిపారు. ఎంపికైన వారిని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)వారు అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరి కోటను సందర్శించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. హర్షవర్ధన్‌రెడ్డిని డైరెక్టర్ సోమిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

పచ్చతోరణం..!



కనగల్-చండూరు ప్రధాన రహదారి వెంట బచ్చన్నగూడెం స్టేజీ సమీపంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనం పంచుతున్నాయి. రోడ్డు వెంట వెళ్లే ప్రజలు, వాహనదారులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు చెట్ల కింద కాసేపు అలా సేద తీరుతున్నారు. –కనగల్, న్యూస్‌టుడే

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని జామేమజిద్ చౌరస్తాలో మంచినీటి సరఫరా సూయిజ్‌వాల్వు దెబ్బతిని నీరంతా రోడ్డుపై వృథాగా పోతుంది. మరమ్మతులు చేయించాలి.
– ఆనంద్‌కుమార్, నల్గొండ.

✔ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.
– దిలీప్‌భార్గవ్, ఏఈ, నల్గొండ పురపాలిక.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385



చిన్నసూరారం కొనుగోలు కేంద్రంలో రాసులుగా పోసిన ధాన్యం

గన్నీ సంచుల కొరత..

అన్నదాతల్లో కలత

అన్నదాతకు విత్తనం వేసిన నుంచి పంట చేతికొచ్చి విక్రయించే వరకు భయమే. చివరకు పంట చేతికొచ్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినా పంట కాంటా అయ్యే వరకు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అక్కడ వర్షం వచ్చినా ధాన్యాన్ని కాపాడుకోవాల్సిందే. జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని.. ఇప్పటి వరకు 350 కేంద్రాల వరకు ప్రారంభించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

అన్ని కేంద్రాలకు పంపుతాం

–హరీశ్, డీఎం పౌరసరఫరాల సంస్థ

పరిశీలించి అన్ని కేంద్రాలకు గన్నీ బ్యాగులు పంపిస్తాం. ఇప్పటికి కొన్నింటికి పంపించాం. కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

బస్తాలు లేవు

జిల్లాలో సన్నాలు 2.80 లక్షలు, దొడ్డు రకం 4.70 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది లక్ష్యం. కేంద్రాలకు తేమ శాతం తెలిపే, తూకం వేసే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు పంపారు. నేటికి బస్తాలు పంపక పోవడంతో కాంటాలు వేయడం లేదని రైతులు వాపోతున్నారు. నల్గొండ మండలం ఆర్జాలబాయి కేంద్రం తప్ప మిగిలిన వాటికి ఇప్పటి వరకు బస్తాలు రాలేదు. ధాన్యాన్ని సిద్ధంగా ఉంచామని రైతులు వాపోతున్నారు. వర్షం వచ్చి తడిస్తే తమ పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❒ నల్గొండ మండలం బాజకుమారం, పెద్దసూరారం, చిన్నసూరారం, దండెంపల్లి, కంచనపల్లి, మర్రిగూడ కేంద్రాల వద్ద పోసిన ధాన్యాన్ని.. బస్తాలు లేక కాంటా వేయడం లేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించిన ఆర్జాల బాయి కేంద్రానికి ఇతర కేంద్రాల నుంచి రైతులు ధాన్యం తీసుకువచ్చి పోస్తున్నారు. మిగతా అన్ని కేంద్రాలకు బస్తాలు పంపి కాంటాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు

ప్రతిభకు పదునుపెట్టి.. బహుమతి సాధించి



బహుమతులు అందచేస్తున్న గౌతమ్ హైస్కూల్ ఇన్‌ఛార్జి బషీర్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నారు. నల్గొండలోని గౌతమ్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి ఎన్.విజయ్‌కుమార్(10వ తరగతి), ద్వితీయ బహుమతి సిహెచ్.జయతి(9వ తరగతి), తృతీయ బహుమతి పి.రిశిత(8వ తరగతి)లు సాధించారు. గౌతమ్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి బషీర్, ఉపాధ్యాయుడు ఫిరోజ్‌లు విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ శిరిషారెడ్డి పాల్గొన్నారు. –నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే

విద్యుత్తు పనులతో

అంతర్జాలానికి అంతరాయం

నాంపల్లి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్తగా ఎత్తైన స్తంభాలు వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. పనులు చేసే క్రమంలో అధికారుల పర్యవేక్షణ కరవైంది. యంత్రాలతో స్తంభాలు నాటే క్రమంలో భూగర్భంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆప్టిక్ ఫైబర్ తీగలు తెగిపోయి, గ్రామీణ నీటి సరఫరా పైపులు పగిలిపోయాయి. దీంతో మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి అంతర్జాల సేవలు, నీటి సరఫరా నిలిచిపోయాయి.



ఆప్టిక్ ఫైబర్ ధ్వంసం కావడంతో మరమ్మతుల కోసం రోడ్డును తవ్విన దృశ్యం

❒ క్లిష్టమైన కొన్ని ప్రాంతాల్లో యంత్రాలను ఉపయోగించకుండా కూలీల సహాయంతో పాత స్తంభాలు తొలగించి వాటి స్థానంలోనే కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇష్టానుసారంగా వ్యవహరించడంతో గ్రామీణ నీటి సరఫరా, అంతర్జాల సేవలకు అంతరాయం ఏర్పడింది. మండలకేంద్రంలో జరిగిన భూగర్భ ఫైబర్ కేబుల్ ధ్వంసం వల్ల జిల్లా వ్యాప్తంగా అంతర్జాల సేవలు అందించే రింగ్ ఫైబర్ దెబ్బతిన్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సంబంధిత విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులపై పర్యవేక్షణ కొనసాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

చండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. శనివారం చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేల చొప్పున వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు మల్లేశం, మండల కార్యదర్శి ధనుంజయ, లింగయ్య, నరసింహ, గోసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మునుగోడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వం నుంచి అధిక నిధులను మంజూరు చేయించి ఎనలేని కృషి చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. పంచాయతీరాజ్ శాఖ నిధుల నుంచి మునుగోడు మండలానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే చిత్రఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు బాధితుల ఆందోళన

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణ సమీపం మీదుగా నిర్మిస్తున్న 565 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు బాధితులు శనివారం ఆందోళన చేపట్టారు. భూసేకరణ సర్వేను ఆపేయాలని ప్లాట్లు, ఇళ్లు కోల్పోతున్న బాధితులు హౌసింగ్‌బోర్డుకాలనీ కూడలి వద్ద సంతోష్‌నగర్‌లో సర్వే అధికారులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ డీఈ రాజశేఖర్ బాధితులతో మాట్లాడారు. భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బాధితుల పక్షాన అధికారులతో చర్చించారు. అలైన్‌మెంట్ ప్రకారం సర్వే జరుగుతుందని, అభ్యంతరాలు, ఇతర విషయాలు ఉంటే పైఅధికారులతో చర్చించాలని బాధితులకు చెప్పారు. తదుపరి సర్వే కొనసాగించారు. ఏఈ సాయి, సర్వేర్ సైదులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక

శాలిగౌరారం, న్యూస్‌టుడే: నల్గొండలోని ఎన్జీ కళాశాలలో ఈనెల 17, 18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) నిర్వహించిన జిల్లా డివిజనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో శాలిగౌరారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, పీడీ బొడ్డు మల్లేష్ తెలిపారు.



ఎం.త్రివేణి (అండర్-17)



స్వాతి (అండర్-14)



ఆర్.యశ్వంత్ (అండర్-14)

అండర్-17 బాలిక విభాగంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.త్రివేణి, అండర్-14 విభాగంలో స్వాతి, ఆర్.యశ్వంత్‌లు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

శాలిగౌరారం: నల్గొండ ఎన్జీ కళాశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో శాలిగౌరారం మండలం వల్లాల ఆదర్శ పాఠశాల విద్యార్థుల జట్టు అండర్-14 విభాగంలో ప్రతిభ కనబర్చి నల్గొండ డివిజన్ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. ప్రిన్సిపల్ కృష్ణమోహన్, పీడీ మల్లేష్, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

దేవాలయాలపై దాడులు అరికట్టాలని ధర్నా

నీలగిరి: దేవతలను అవమానిస్తూ దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం నుంచి పెద్దగడియారం చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు స్పందించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భజరంగ్‌దళ్ ప్రాంతీయ కో కన్వీనర్ వెంకట్, నర్సింహా, సంపత్ వర్మ, కృష్ణయ్య, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్, సాత్విక్, హరికిషోర్ పాల్గొన్నారు.



పెద్దగడియారం చౌరస్తాలో ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు

గుంటూరులో నల్గొండ పోలీసుల తనిఖీలు..?

గుంటూరు, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తెలంగాణలోని మిల్లులకు తరలించి..అక్కడ పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న వ్యక్తి కోసం శనివారం గుంటూరులో నల్గొండ జిల్లా పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఐదేళ్ల క్రితం నల్గొండ జిల్లాలోని రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న వారిని అక్కడి పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే రూ.18 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని పట్టుకుని నిందితులను అరెస్ట్ చేశారు. అందులో బాపట్ల జిల్లాకు చెందిన చీమకుర్తి సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గుంటూరులో రేషన్ బియ్యాన్ని తరలించే వ్యక్తి కోసం అక్కడి నుంచి పోలీసులు గుంటూరు వచ్చారు. గుంటూరులో అతని కోసం తనిఖీలు నిర్వహించగా..పరారీలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు వెనుదిరిగినట్లు తెలిసింది.

21 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభలు

నకిరేకల్, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెంలో ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి కోరారు. నకిరేకల్‌లో మహాసభల ప్రచార గోడపత్రికలను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. మాజీ ఎంపీపీ సుంకి మణెమ్మ, పి.శశికళ, రేణుక, సోమమ్మ, విజయ, జయమ్మ పాల్గొన్నారు.

నల్గొండ గ్రామీణం: ఐద్వా రాష్ట్ర మహాసభల గోడపత్రికను నల్గొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి మాట్లాడారు. ఐద్వా పట్టణ కార్యదర్శి అరుణ, పట్టణ అధ్యక్షురాలు పద్మ, ఉమారాణి, పుష్పలత, దేవి, తులసి, కరుణ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

క్రైం రిపోర్ట్

నాంపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన నాంపల్లి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం బాపూజీనగర్‌కు చెందిన దేరంగుల యాదగిరి(40) కుటుంబంతో ఇరవై రోజుల క్రితం కూలీ పనుల నిమిత్తం నాంపల్లికి వచ్చాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోంది. శుక్రవారం ఉదయం చండూరు మండలంలో పత్తి తీసేందుకు కుమారుడు, కుమార్తెతో కూలీపనులకు వెళ్లిన భార్య రజిత రాత్రి 8గంటల సమయంలో ఇంటికిరాగా అప్పటికే యాదగిరి ఫ్యాన్ కొక్కానికి ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ నామాల పరిశోధకుడు మండల స్వామి మృతి

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన ప్రాచీన గ్రామ నామాల పరిశోధకుడు, తెలుగు భాష ప్రభుత్వ ఉపాధ్యాయుడు డా. మండల స్వామి(50) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలంలోని వెలువర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో అస్వస్థతకు గురవడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన 'ప్రాచీన గ్రామ నామాల చారిత్రక సాంస్కృతిక సామాజిక దృక్పథం' అనే అంశంపై పరిశోధనలు చేశారు. పలు గ్రామాలలోని ప్రాచీన శిలాశాసనాలను పరిశీలించి ఆయా గ్రామాలకు గల పేర్లపై పరిశోధన చేశారు. పలు జాతీయస్థాయి తెలుగు సదస్సులలోను పాల్గొన్నారు.



నీలగిరి: ప్రముఖ కవి, కథకుడు, సాహితీ విమర్శకుడు డాక్టర్ మండల స్వామి మృతి సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు, రచయితలు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తమ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. తెలిపిన వారిలో డాక్టర్ కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, రామకృష్ణ, సంతపురి నారాయణరావు ఉన్నారు.

బ్యాటరీలు చోరీ

మర్రిగూడ, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా బ్యాటరీల చోరీలు కలకలం రేపుతున్నాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. . మండల పరిధిలోని యరగండ్లపల్లి, రాంరెడ్డిపల్లి, సరంపేట గ్రామాల్లో టిప్పర్లు, ట్రాక్టర్లు, డీసీఎంల యజమానులు రోజులాగే తమ వాహనాలను ఇంటి ముందు శుక్రవారం రాత్రి నిలిపి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగానే వాహనాల్లో బ్యాటరీలు కనపడటం లేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవటంతో స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగారెడ్డి తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: మాజీ ఎమ్మెల్యే

కట్టంగూరు, న్యూస్‌టుడే: షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ కట్టంగూరులో భారాస ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తానని హామీలిచ్చి, నేటికి నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను సత్వరమే అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు తరాల బలరాములు, నర్సింహ, పెద్ది బాలనర్సింహ, సైదిరెడ్డి, బుచ్చమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

అన్నదాతలకు అనుకోని కష్టం

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మూసీ ఆయకట్టు, నాన్ ఆయకట్టు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గుడివాడ, కొత్తపేట, బండపాలెం తదితర గ్రామాలలో కోసిన వరి పొలాలనుంచి వచ్చిన ధాన్యాన్ని రైతులు కల్లాల్లో ఆరబెట్టారు. ఒక్కసారిగా వచ్చిన వానకు ధాన్యం కొట్టుకుపోయింది. పత్తిచేలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సేకరించిన పత్తిమొత్తం తడిసి ముద్దయ్యింది. కోసేందుకు సిద్ధమైన వరిపొలాలు వంగి నేలమట్టమయ్యాయి. నల్లరేగడి పత్తిచేలలో నీరు నిలిచింది.



వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేసుకుంటున్న రైతు

చెరుపల్లిని పరామర్శించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చిట్యాల, న్యూస్‌టుడే: మాతృవియోగంతో బాధపడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములును మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం రాత్రి పరామర్శించారు. మృతురాలు లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సీతారాములుతో పాటు ఆయన సోదరులను కూడా వారు పరామర్శించారు. వ్యకాస జాతీయ కార్యదర్శి బి.వెంకట్, జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్, భారాస చిట్యాల అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, శ్రీనివాస్, కూరెళ్ల లింగస్వామి, సైదులు ఉన్నారు.



సీతారాములు తల్లి లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవ్వాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణంలోని కతాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ దండెంపల్లి సరోజ మాట్లాడారు. ప్రైవేటుగా దీటుగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ ఏడాది తమ పాఠశాలలో అత్యధిక ప్రవేశాలు జరిగాయని, ఇందుకు కారణం ఇక్కడ నాణ్యమైన విద్య అందించడమేనని పేర్కొన్నారు. హెచ్ఎం విజయలక్ష్మీ, చాంద్‌బీ, రాణి, రాజశేఖర్, ఆరోగ్యమ్మ, శైలజ, మధుబాబు, భవాని పాల్గొన్నారు.



నల్గొండ కతాల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ సత్యసాయి మందిరంలో ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు దేవతామూర్తుల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు అంకురార్పణగా సత్యసాయి మందిరంలో పుసుపుకొట్టే పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 26న సీతారాముల కల్యాణం, 27న సువర్చలా హనుమత్ కల్యాణం, 28న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాసులు, నకిరేకల్ కన్వీనర్ గర్రె శ్రీనివాసులు తెలిపారు. మహిళా విభాగ్ ప్రతినిధి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: సత్యసాయి మందిరంలో కల్యాణోత్సవాల కోసం పసుపుకొట్టే పూజల్లో మహిళా భక్తులు

బీటీ రహదారుల కోసం రూ.15 కోట్లు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా పది బీటీ రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ.15 కోట్లను మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నెం.624ను తాజాగా జారీచేసిందని ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన విజ్ఞప్తితో సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సీఆర్ఆర్ గ్రాంట్ నుంచి ఈ నిధుల మంజూరుకు కృషి చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌హెచ్-9 నుంచి బైరెడ్డిగూడ రహదారికి రూ.1.50 కోట్లు, చెర్వుఅన్నారం ఎక్స్‌రోడ్డు నుంచి అడవిబొల్లారం-నెల్లిబండకు రూ.3.25 కోట్లు, మండలాపురం- కొండకిందిగూడెం రూ.1.95 కోట్లు, ఆర్లగడ్డగూడెం- రామచంద్రాపురం రూ.1.30 కోట్లు, భీమారం-పాములపాహడ్- జిల్లేలవారిగూడ రూ.1.15 కోట్లు, బండపాలెం- కొత్తగూడెం రూ.81 లక్షలు, ఎన్‌హెచ్-9 నుంచి పాములపహడ్- తెలగగూడెం రూ.2.50 కోట్లు, ఎన్ఎచ్-9 నుంచి సూరకంటిగూడెం రూ.84 లక్షలు, అమ్మనబోలు-శాలిగౌరారం పీడబ్ల్యూడీ రోడ్డు- బైరోనిబండ పీడబ్ల్యూడీ రోడ్డు- బెండల్‌పహాడ్ రూ.70 లక్షలు, లక్ష్మాపురం- కొత్తగూడెం రూ.కోటి చొప్పున మంజూరయ్యాయని ఎమ్మెల్యే వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నకిరేకల్, న్యూస్‌టుడే: మండలానికి చెందిన 11 మంది ఉపాధ్యాయులు పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలకు ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నకిరేకల్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం వారిని సన్మానించారు. స్థానిక పీఆర్టీయూటీఎస్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.సత్యనారాయణ, కె. యాదయ్య, ఎం.కవిత, ఎం.ఏ కరీమ్ మాట్లాడారు. మండల శాఖ గౌరవ అధ్యక్షురాలు కె.అనిత, అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆనంద్‌బాబు, సీహెచ్. సుధాకర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

కేతేపల్లి,న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. మండలంలోని ఇనుపాముల, తుంగతుర్తి, కొప్పోలు, భీమారం, చీకటిగూడెం, కేతేపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. చెరుకుపల్లిలో శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ ప్రారంభించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పురుషోత్తం, నర్సయ్య, శేఖర్ పాల్గొన్నారు.

చిట్యాల గ్రామీణం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. చిట్యాల మండలంలోని వట్టిమర్తి, ఉరుమడ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం ప్రారంభించారు. సన్నరకం ధాన్యం కొనుగోలు నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 42 సెంటర్లను ప్రారంభించామని తెలిపారు. పీఏసీఎస్ ఛైర్మన్ సుంకరి మల్లేశ్‌గౌడ్, డైరెక్టర్లు నర్రా మోహన్‌రెడ్డి, భిక్షంరెడ్డి, కొమరయ్య, సురేందర్ పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యే వేముల వీరేశం, అధికారులు

విద్యార్థులకు బూట్ల పంపిణీ

తిప్పర్తి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు నల్గొండ గ్రేటర్ సంస్థ అధ్యక్షుడు గోద కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు యాదగిరిరావు తెలిపారు. మామిడాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పూస లింగయ్య తన భార్య పూస సుజాత జ్ఞాపకార్థం బూట్లను అందజేశారు. వెంకట్‌రెడ్డి, రవీందర్‌రావు, వేదవ్యాస్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సైదయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాల అధ్యాపకుడికి జాతీయ పురస్కారం



నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుడు **డా.వాస భూపాల్** అఖిల భారతీయ భాషా సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్య రంగంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన సాహిత్య పురస్కారం అందుకోనున్నారు. జాతీయ అవార్డుకు అర్హత సాధించిన భూపాల్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు సురేశ్‌బాబు, రవికుమార్, బి.నాగరాజు, ప్రసన్నకుమార్, శ్రీధర్ అభినందించారు.

డీఈవోకు ఫిర్యాదు

నల్గొండ విద్యావిభాగం: చండూరు జి.ప.ఉ.పాలలో పనిచేసిన వంట మనుషులపై అక్కడి హెచ్ఎం అసభ్య పదజాలంతో తిట్టారని విచారించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతికి వంట చేసిన మహిళలు, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. కట్టెల శివకుమార్, నరేష్, కిరణ్, కొండన్న, తరుణ్ పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** .విశ్వం, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ**- విశ్వం, **వెంకటేశ్వర**- దేవర

అవీ ఇవీ

ఆంజనేయుని పూజల్లో కిషన్‌రెడ్డి.. శాలిగౌరారం: శాలిగౌరారం కట్టపై వందేళ్ల క్రితం వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో భారాస రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు రత్నమాచార్యులు, రఘునందనాచార్యులు, రామచంద్రాచార్యులు, భిక్షం, జగన్, వెంకన్న పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి.. గట్టుప్పల: నూతనంగా ఏర్పాటైన గట్టుప్పల మండలం రెండేళ్లు దాటిన ఇప్పటివరకు అభివృద్ధి పనులకు నోచుకోలేదని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్నాటి వెంకటేశం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోపణలు సరికాదు.. కేతేపల్లి: ఎమ్మెల్యే వేముల వీరేశంపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కేతేపల్లిలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మాధవరెడ్డి, వెంకటనర్సయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ

• మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

ఉద్యమకారుల కృషి ఎప్పటికి మరువలేనిది

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సాధనకు పోరాటంలో ఉద్యమకారుల కృషి ఎప్పటికి మరువలేనిదని బీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల పోరం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో పనిచేసిన ఉద్యమకారులకు ప్రశంస పత్రాలను శనివారం సాగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలో ఉద్యమకారులు ఎన్నో కష్ట నష్టాలు పడి రాష్ట్రం సాధించారని అన్నారు. ఉద్యమకారులు రమేశ్‌జీ, నర్సింహ్మారెడ్డి, కొండలు, వెంకోజీ, మధు, సత్యనారాయణ(ఉక్కు)లకు ఆమె ప్రశంస పత్రాలను అందజేశారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రాంనగర్ బంధంలో వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. – వెంకన్న, మిర్యాలగూడ

✔ పగటి వేళలో వీధి దీపాలు బంద్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

చెక్కుల పంపిణీ

త్రిపురారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మొత్తం 11 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారులు చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, నిడమనూరు మార్కెట్‌కమిటీ ఛైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, దనసింగ్‌నాయక్, అనంతరెడ్డి, సోమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, వెంకట్రామ్‌నాయక్, వీరయ్య, బాలకృష్ణ, చంద్ర పాల్గొన్నారు.



త్రిపురారంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేసి అభినందిస్తున్న చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ నర్సిరెడ్డి



విజేతలకు బహుమతులు అందజేసి అభినందిస్తున్న సెయింట్ జాన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ అలుగుబెల్లి శ్రీనివాసరెడ్డి



కొండమల్లేపల్లిలో ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ప్రతిభకు పట్టం

'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో 'అంతర్జాల వినియోగం-విద్యార్థులలో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బత్తుల మేధశ్రీ(పదో తరగతి), షేక్ తస్విన్ (పదో తరగతి), పాదిల తేజస్విని(ఎనిమిదో తరగతి) గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ వై.నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ జయంతి బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

★ సెయింటు జాన్స్ హైస్కూల్‌లో 'అంతర్జాల వినియోగం-విద్యార్థులలో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కంచి భవ్యశ్రీ(ఎనిమిదో తరగతి), పజ్జూరి లావణ్య(తొమ్మిదో తరగతి), ధీరావత్ మాధవి(పదో తరగతి) గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ శిరీష బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

★ ఈనాడు ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలోని సాయి సిద్ధార్థ పాఠశాలలో 'అంతర్జాల వినియోగం-విద్యార్థులలో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు షేక్ రియా (10వ తరగతి), నక్క సాత్విక (9వ తరగతి), బొల్లు సాజన్య (10వ తరగతి) గెలుచుకున్నారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ చిట్టెడి ప్రభాకర్, డైరెక్టర్లు నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, ఆమనగంటి రాజశేఖరరావు బహుమతులు అందజేశారు. రాజు, ప్రసాద్, దుర్గాశంకర్, కిరణ్‌కుమార్, సాఫియా తదితరులు పాల్గొన్నారు.

– మిర్యాలగూడ, కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే

భవనాలు అప్పజెప్పాలని ధర్నా

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలో రెండేళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ భవనాలకు ఆయా సంఘాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ పలు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పుర కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. భవనాలు గ్రంథాలయానికి ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంతో ఆయా సంఘాల సభ్యులు ఆందోళనకు ఉన్నారు. అనంతరం పుర కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మట్టయ్య, అంజి, కాశి, జవరాజు, వెంకటేశ్వర్లు, భరత్, మురళీ యాదవ్, కిరణ్ పాల్గొన్నారు.



మిర్యాలగూడ పుర కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

అధ్యాపకులను నియమించాలని...

హాలియా, న్యూస్‌టుడే: అనుముల మండలం హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గణితం, వృక్షశాస్త్రం సబ్జెక్టు బోధించే అధ్యాపకులని నియమించాలని ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వారు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కళాశాల్లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న మొదటి, రెండవ సంవత్సరం 118 మంది విద్యార్థులం ఉన్నామని.. గత ఐదు నెలలుగా అధ్యాపకులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, రమేష్ విమర్శించారు. మండల కార్యదర్శి చందు, పట్టణ అధ్యక్షుడు వర్షిత్, వరప్రసాద్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి బలవన్మరణం



నాంపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన నాంపల్లి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం బాపూజీనగర్‌కు చెందిన డేరంగుల యాదగిరి(40) కుటుంబంతో ఇరవై రోజుల క్రితం కూలీ పనుల నిమిత్తం నాంపల్లికి వచ్చాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోంది. శుక్రవారం ఉదయం చండూరు మండలంలో పత్తి తీసేందుకు కుమారుడు, కుమార్తెతో కూలీపనులకు వెళ్లిన భార్య రజిత రాత్రి 8గంటల సమయంలో ఇంటికిరాగా అప్పటికే యాదగిరి ఫ్యాన్ కొక్కానికి ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

చింతపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలైన ఓ విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం పస్నూరు గ్రామానికి రాపోతు సందీప్(21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 12న చింతపల్లి మండలంలోని నెల్వలపల్లిలో ఉన్న స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారు వద్దకు చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువు తోకల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాడెం ఇద్దయ్య ఆచూకీ లభ్యం

దేవరకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన మాడెం ఇద్దయ్య ఈనెల 14న శ్రీశైలం వెళ్తూ మున్ననూరు వద్ద అదృశ్యమయ్యారు. ఆయన ద్విచక్రవాహనం, చరవాణి, హెల్మెట్ అక్కడే నల్లమల అడవిలో పడి ఉండడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. అమ్రాబాద్ పోలీసులు, అటవీశాఖ అధికారులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో మాడెం ఇద్దయ్య సంచరిస్తుండడంతో అక్కడి వాసులు పోలీసులకు సమాచారం అందించారు. ఆయన తలకు గాయం, అంగి చిరిగి ఉండడంతో కుటుంబసభ్యులు ఆయనను తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం సాయంత్రం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం కంకణాలపల్లికి చెందిన వెంకన్న కుటుంబాన్ని వదిలి 20 ఏళ్లుగా పట్టణంలో కూలి పని చేసుకుంటూ.. రోడ్లపై, చెట్ల కింద నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం స్థానిక రాజీవ్‌చౌక్ వద్ద నిలబడి ఉండగా.. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టి ఎడమ కాలుపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాగా తీవ్ర గాయాలైన వెంకన్నను ఆసుపత్రికి తరలించేందుకు ఆటో డ్రైవర్లు ముందుకు రాకపోవడంతో నొప్పితో అల్లాడిపోయాడు. పోలీసులు వచ్చి స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ కార్యశాలకు మిర్యాలగూడ కమిషనర్



ఎండీ యూసుఫ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని ల్యాండ్ రికార్డ్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో దిల్లీలో నిర్వహించనున్న సర్వే, రీ సర్వే ఫర్ అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ అనే అంశంపై నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యశాలకు మిర్యాలగూడ పుర కమిషనర్ ఎండీ యూసుఫ్ హాజరు కానున్నారు. కార్యశాలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్రం నుంచి మొత్తం 8 మంది పుర కమిషనర్లకు ఆహ్వానాలు అందాయి. యూసుఫ్‌తో పాటు వర్ధన్నపేట, కొడంగల్, జగిత్యాల, జడ్చర్ల, మణుగూరు, హుస్నాబాద్, మహబూబాబాద్ పుర కమిషనర్లు సైతం కార్యశాలకు హాజరు కానున్నారు. కార్యశాలలో పలు దేశాల్లో భూముల రికార్డుల నిర్వహణ, సర్వే అంశాలపై చర్చించనున్నారు.



సమీక్ష సమావేశంలో సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ

వారంలోగా పూర్తి చేయాలి: సబ్‌కలెక్టర్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసిన సభ్యులు ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ ఆదేశించారు. స్థానికంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని ప్రతి దరఖాస్తును తనిఖీ చేసి అర్హులను గుర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, పురపాలిక ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐటీఐ నూతన కోర్సు ప్రవేశాలకు గడువు పెంపు

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా ఐటీఐ కళాశాలలో ప్రవేశ పెట్టిన నూతన అడ్వాన్స్ కోర్సు గడువును ఈ నెల 30 తేదీ వరకు పెంచినట్లు హాలియా ఐటీఐ ప్రిన్సిపల్ ఎస్.మల్లికార్జున్ శనివారం తెలిపారు. నూతన అడ్వాన్స్ కోర్సులు మ్యానుఫ్యాక్చరింగ్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నిషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్‌లలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివిధ ట్రేడ్లకు చేరేందుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.

గోడ పత్రికల ఆవిష్కరణ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరుగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల గోడపత్రికలను శనివారం మిర్యాలగూడలో ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపనబోయిన నాగమణి మాట్లాడుతూ.. మహిళలను కేంద్రం చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో గోవర్ధన, అరుణ, ఊర్మిళ, కౌసల్య, భాగ్యమ్మ, సంధ్య, సుకన్య పాల్గొన్నారు.

వేములపల్లి: భద్రాద్రి కొత్తగూడెంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరుగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల గోడపత్రికలను శనివారం వేములపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి పాదూరు గోవర్ధన, మండల అధ్యక్షురాలు పొదిల లక్ష్మమ్మ, అనిల్‌రెడ్డి, మాధవి, పద్మ, సుకన్య, మంగమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన చేసినప్పుడే గుర్తింపు

చింతపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు విద్యార్థులకు నిస్వార్థంగా ఉత్తమ బోధన చేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి సూచించారు. మండలంలోని వర్కాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయురాలిని గ్రామస్థులు సన్మానించారు. మాజీ సర్పంచి మర్ల నందయ్య, పోలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్కాలలో నూతనంగా వచ్చిన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు

వార్షికోత్సవ జయప్రదానికి పిలుపు

దేవరకొండ, న్యూస్‌టుడే: కల్లు గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల హక్కుల సంక్షేమం కోసం ఏర్పాటైన గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు కుంభం జయరాములు పిలుపునిచ్చారు. శనివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. చింతపల్లి పుల్లయ్య, కాటం గోవర్ధన్, జూలూరు మహేష్, మట్టపల్లి రాములు, యాదయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీత పనివారల సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు కుంభం జయరాములు

తగ్గని వరద ఉద్ధృతి



డిండి ప్రాజెక్టు మిగులు జలాలతోపాటు వరుసగా కురుస్తున్న వర్షాల వరద తోడుకావటంతో డిండి వాగు ఉద్ధృతి రోజురోజుకు పెరుగుతోంది. దీంతో దిగువ భాగంలో ఉన్న గ్రామాలకు చెందిన పంటలు మునగగా.. రెండు జిల్లాల ప్రయాణికులు వెళ్లే రహదారి జలదిగ్బంధం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పశువులు, గొర్రెల కాపరులు మేపేందుకు అటువైపు వెళ్లొదని పోలీస్, నీటిపారుదలశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, చందంపేట


న్యాయమూర్తికి ఘన సత్కారం

మిర్యాలగూడ లీగల్, న్యూస్‌టుడే: మిర్యాలగూడ కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న స్వర్ణలతను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, సకినాల వేలాద్రి, శ్రీధర్‌గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మిర్యాలగూడలో న్యాయమూర్తి స్వర్ణలతను సత్కరిస్తున్న న్యాయవాదులు

కొడుకు దశదినకర్మ రోజే తండ్రి మరణం



నిడమనూరు, న్యూస్‌టుడే: కుమారుడి దశదినకర్మ రోజే తండ్రి అనారోగ్యంతో మరణించిన విషాద ఘటన నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. నిడమనూరుకు చెందిన **పాల్వాయి మట్టయ్య**కు ఇద్దరు కుమారులు.. కాగ చిన్న కుమారుడైన పాల్వాయి శ్రీకాంత్(34), ఈ నెల 8న ఆర్థిక పరమైన కారణాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం అతడి దశదినకర్మ నిర్వహించి వారి బంధువులకు ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. చేతికందివచ్చిన కొడుకు మరణంతో అనారోగ్యానికి గురైన మట్టయ్య గురువారం శ్వాసతీసుకోవడంలో తీవ్ర ఇబ్బందికి గురికాగా.. కుటుంబసభ్యులు అతడిని నల్గొండలో ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు మట్టయ్య స్పందించకపోవడంతో వైద్యులు ఫలితం లేదని చెప్పటంతో ఇంటికి తీసుకెళ్లమని చెప్పారు. కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి తీసుకొస్తుండగా.. మార్గమధ్యలోనే మృతిచెందారు.



అడవిదేవులపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలో ప్రజాసమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి అన్ని విభాగాల అధికారులతో స్థానిక రైతు వేదికలో శనివారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులు, పరిష్కరించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ప్రతీ రైతుకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు కృషిచేస్తానన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆయన మొక్క నాటారు. శంకర్‌నాయక్, శ్రీనివాస్, బాలునాయక్, దస్రునాయక్, శ్రీరాంసురేష్‌కుమార్, మోసిన్ బిన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అరెస్టు అప్రజాస్వామికం ... దేవరకొండ: గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఐపీఎస్, భారాస నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. శనివారం దేవరకొండలో స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ తీసుకొచ్చిన 95శాతం స్థానిక రిజర్వేషన్లు తుంగలోతొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు తగవు... చింతపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుడు ఎలిమినేటి నర్సింహా అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. భారాస హయాంలో ఎలాంటి కమిటీలను ఏర్పాటు చేయకుండా పార్టీ కార్యకర్తలకే పథకాలను అమలు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లపై అఖిలపక్షం ఏర్పాటు చేసి కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం తగదన్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం... అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి సబ్‌స్టేషన్‌లో సత్రశాల ఫీడర్ కోసం కొత్త బ్రేకర్ ఏర్పాటులో భాగంగా ఆదివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, ముదిమాణిక్యం, గోన్యాతండా, చాంప్లాతండా, జిలకరకుంటతండా, హేమంతండా, తాటిచెట్టుతండా, వీర్లపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

వాక్ ఫర్ ఫ్రీడం, నడకపై అవగాహన... దేవరకొండ: వాక్ ఫర్ ఫ్రీడం, నిశ్శబ్ద నడక అనే కార్యక్రమాన్ని ఆస్ట్రేలియా ఏ21, ది మూమెంట్ ఆఫ్ ఇండియా, ముంబయి సహకారంతో గ్రామజ్యోతి సొసైటీ, ఇందిర మహిళ చైతన్య మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవరకొండ కస్తూర్బా పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్జీవోలు క్లుప్తంగా తెలిపారు. లోకసాని మన్మథరెడ్డి, కె.నీమయ్య, సావిత్రి, ఎల్.దామోదర్‌రెడ్డి తదితరులున్నారు.

'జమిలి' నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి... చందంపేట: దేశంలో జమిలి ఎన్నికల నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐలయ్య కోరారు. శనివారం పందిగుండ తండలో నిర్వహించిన పార్టీ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. నాయకులు నల్ల వెంకటయ్య, నాగెటి నాగరాజు, బీముడు, మాన్‌సింగ్, హస్ననాయక్, కుమార్, ఆంజనేయులు, ముత్యాలు తదితరులున్నారు.

తనిఖీ.. హాలియా: హాలియా పట్టణంలో పురుగుమందుల దుకాణాలలో వ్యవసాయ అధికారులు తనిఖీలు జరిపారు. శనివారం హాలియా డివిజన్ వ్యవసాయ అధికారి వెంకటరమణ, మండల ఏవో సురిత మండలంలోని పలు పురుగుమందుల దుకాణాలలో డీలర్ల స్టాక్ వివరాల రిజిస్టార్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు పురుగుమందులు విక్రయించాలని.. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

రైతు భరోసా విడుదల చేయాలి.. మిర్యాలగూడ పట్టణం: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కా.ని.అధ్యక్షుడు తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎకరాకు రూ.7,500 ఇస్తామని హామీ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గంగాధర్, చిలకల మురళి, నరసింహ, నరేష్, శైలేందర్, శంకర్ పాల్గొన్నారు.

యాదయ్య సేవలు మరవలేనివి... చింతపల్లి: విద్యుత్తు శాఖలో పని చేసిన లైన్‌మెన్ వడ్లకొండ యాదయ్య సేవలు మరవలేనివని మాజీ సర్పంచి కాయితీ జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీదేడు సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహించి బదిలీపై మర్రిగూడ మండలానికి వెళ్లిన యాదయ్యను శనివారం సన్మానించి మాట్లాడారు. మాజీ సర్పంచి దాసరి శ్రీనివాస్, ఉపసర్పంచి దరణిపతి రమణారావు, రామవత్ శ్రీనివాస్, చంద్రమౌళి, రాములు, సిబ్బంది శ్రీను, నరేష్, సర్వర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపిక.. గుర్రంపోడు: గుర్రంపోడు మండలం పిట్టలగూడెం మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థి మనోహర్ వాలీబాల్ జిల్లాజట్టుకు ఎంపికయ్యాడు. శనివారం నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన డివిజన్ టీంల మధ్య జరిగిన పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఆదివారం ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొననున్నాడు.

కూలిన సిమెంట్ దిమ్మె.. తప్పిన ప్రమాదం.. మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని ప్రధాన రహదారి నుంచి రెడ్డి కాలనీకి వెళ్లే దారిలో చెన్నయ్ షాపింగ్ మాల్ పక్కన భవనంలోని ఎస్బీఐ బోర్డు ఊడి పోయి సిమెంట్ దిమ్మె కూలింది. బోర్డు పడిపోయిన, దిమ్మె కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. కాగా సిమెంటు దిమ్మె, బోర్డు పడడంతో ఆ ప్రాంతంలో ఉన్న బ్యాంకు సిబ్బందికి చెందిన ద్విచక్ర వాహనం ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి.. మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని కిష్టాపురం గ్రామానికి చెందిన రాములు(60) గీతకార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. గ్రామస్థులు, ఆయన బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాములు కులవృత్తిని అవలంబిస్తూ.. జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 20న కల్లు గీసేందుకు వెళ్లి చెట్టుఎక్కుతుండగా.. కాలు జారి కిందపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక